ప్రజాశక్తి
సోమవారం 27 ఫిబ్రవరి 2023
5
శ్రీకాకుళం



రేపు వైసిపి అత్యవసర సమావేశం

శ్రీకాకుళం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాయకులతో అత్యవసర సమావేశాన్ని ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో ఆరోజు ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం వ్యూహాన్ని ఖరారు చేస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ప్రాంతీయ సమన్వయకర్త, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లాలోని మంత్రులు, జెడ్‌పి చైర్‌పర్సన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల పరిశీలకులు హాజరై తగిన సూచనలు చేస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని వైసిపి జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, కార్పొరేషన్, మున్సిపాల్టీల చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, నియోజకవర్గాల వారీగా పలు విభాగాల ప్రతినిధులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఉద్యమాలతోనే విద్యారంగ పరిరక్షణ

- సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే...
- ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి
- ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



టెక్కలి : సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్, కొత్తూరు

ప్రభుత్వ విద్యారంగాన్ని ఉద్యమాలతోనే పరిరక్షించుకోవాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. టెక్కలిలోని ఆదిత్య కళ్యాణ మండపంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన 'సంక్షేమ రాజ్యం-పెన్షన్ విధానం', కొత్తూరులోని కళ్యాణ మండపంలో 'విద్యపై దాడి-మన కర్తవ్యం' అంశాలపై ఆదివారం నిర్వహించిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. పాఠశాలల విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలలన్నీ ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయన్నారు. నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి పునాది అయిన ప్రాథమిక పాఠశాలలు, ప్రభుత్వ విద్యారంగాన్ని ధ్వంసం చేశాయని విమర్శించారు. రాష్ట్రంలో 51 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇన్ని ఖాళీలతో విద్యాభివృద్ధి ఏవిధంగా సాధ్యమని ప్రశ్నించారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారంతో బోధనకు సమయం తగ్గి విద్యా ప్రమాణాలు కుంటుపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే బైజూస్ బోధన, ఆంగ్లమాధ్యమం, నాడు-నేడు, సిబిఎస్‌ఇ సిలబస్‌ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే...

కార్పొరేట్లకు మాత్రమే లాభాన్ని చేకూర్చే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేయాల్సిందేనని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన జిపిఎస్ విధానమూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం లాభదాయకం కాదని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ జీతాల నుంచి కంట్రిబ్యూషన్ కట్టించుకుంటూ పెన్షన్ చెల్లించే విధానాన్ని ఇక అంగీకరించబోమన్నారు. ఎన్నికల హామీ ఇవ్వని ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, పంజాబ్ మరికొన్ని రాష్ట్రాల్లో సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్ విధానం అమలుకు సిద్ధమవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒపిఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన సిపిఎస్ రద్దు హామీని అమలు చేయకపోగా, అందుకోసం పోరాడుతున్న ఉపాధ్యాయులపై ప్రత్యేకించి యుటిఎఫ్ నాయకులపై కేసులను బనాయించడం, భయపెట్టే చర్యలు తగవన్నారు. మాట తప్పం, మడమ తిప్పమని ప్రచారం చేసుకున్న ముఖ్యమంత్రి, సిపిఎస్ విధానంపై ఎందుకు మాట తప్పారని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫేస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్లే ఉద్యోగులు వ్యతిరేకమయ్యారని తెలిపారు.

డిఎ బకాయిలు, ఎరియర్స్ చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. 11వ పిఆర్‌సిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంపై చొరవ చూపడం లేదన్నారు. ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై చట్టసభల్లో పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను శాసనమండలికి పంపిస్తే ప్రజా గొంతుకకు బలం చేకూరుతుందన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.దాలయ్య, జి.మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, నాయకులు డి.లక్ష్మీనారాయణ, పి.జగదీష్, పి.ధర్మారావు, ఎల్.బాబూరావు, బి.చిట్టిబాబు, ఎం.వి రమణ, జి.శ్రీరంగ నాయకులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. వచ్చే నెల ఏడో తేదీ వరకు రెండు విడతల్లో జిల్లాలోని 134 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరగనున్నాయి. జిల్లాలో 13,167 మంది ఎంపిసి, 6,308 మంది బైపిసి విద్యార్థులు మొత్తం 19,475 మంది హాజరు కావాల్సి ఉంది. తొలిరోజు ఆదివారం ఇంటర్ ప్రథమ సంవత్సర ఫిజిక్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించారు. వీటికి 7,690 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 222 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. 7,468 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణకు ప్రతి కేంద్రానికి ప్రత్యేకంగా చీఫ్ సూపరింటెండెంట్, ఎగ్జామినర్లను నియమించారు. నాన్ జంబ్లింగ్ విధానంలో విద్యార్థులు వారు చదివే కళాశాలల్లోనే ప్రాక్టికల్స్ చేసేందుకు ఇంటర్ బోర్డు అవకాశం కల్పించింది. అధ్యాపకులకు మాత్రం జంబ్లింగ్ విధానంలో పరీక్షా కేంద్రాలను కేటాయించారు. రాష్ట్ర పరిశీలకులు డి.గోపాలరెడ్డి పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్ కాకుండా పర్యవేక్షణ బృందాలతో పాటు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 63 కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఆర్ఐఒ శివ్వాల తవిటినాయుడు తెలిపారు. ప్రాక్టికల్స్ జరుగుతున్నప్పుడు బయట వ్యక్తులను ఎవరినీ అనుమతించేది లేదని స్పష్టం చేశారు.



ఒలింపిక్ సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షునిగా కృష్ణదాస్

వరుసగా 8వసారి ఏకగ్రీవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా ఎనిమిదోసారి ధర్మాన కృష్ణదాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1994 నుంచి ఇప్పటివరకు ఆయన ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. నగరంలోని గురిటి పోలమ్మ ఆలయ కమ్యూనిటీ హాల్లో ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా బి.వి రమణ, కె.గోపి, మోహన వెంకటరావు వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మెంటాడ సాంబమూర్తి, కోశాధికారిగా యాళ్ల పోలినాయుడు, ఉపాధ్యక్షులుగా శిమ్మ రాజశేఖర్, మెంటాడ పద్మనాభం, చిట్టి నాగభూషణం, బి.ఎ లక్ష్మణ దేవ్, కె.ఎన్.ఎస్.బి ప్రసాద్, కె.మధుసూదనరావు, సంయుక్త కార్యదర్శులుగా పి.తవిటయ్య, ఎం.వి రమణ, కొమర భాస్కరరావు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.ఎస్.సి శేఖర్, కార్యవర్గ సభ్యులుగా రెడ్డి శివకుమార్, కొండపల్లి రవికుమార్, సిగిలిపల్లి లక్ష్మీదేవి, బాడాన నారాయణరావు, ఎస్.వి జగన్నాథం, పైడి గోవిందరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం అధ్యక్షులు కృష్ణదాస్ మాట్లాడుతూ రాజకీయాలకు, కుల, మత, వర్గ భేదాలకు క్రీడలు అతీతమన్నారు. తనను మరోసారి అధ్యక్షునిగా ఎన్నుకోవడం బాధ్యతను మరింత పెంచిందన్నారు. జిల్లాలో క్రీడలపై ఆసక్తి పెరుగుతోందని చెప్పారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.

ఉత్తరాంధ్ర సమస్యలపై గళమెత్తే..

రమాప్రభను గెలిపించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, హాజరైన పలు కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ప్రభుత్వరంగ పరిశ్రమల రక్షణకు 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను శాసనమండలి ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ ఆదివారం జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మిక సంఘాల నాయకులతో ముఖాముఖి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటు సమస్య పరిష్కారం కోసం ఏ ఒక్క పార్టీ నేడు కృషి చేయడం లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసిపి ప్రభుత్వం కక్ష కట్టిందని తెలిపారు. ఆరేళ్లుగా శాసన మండలిలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ మాధవ్ ఈ ప్రాంత అభివృద్ధిపై మాట్లాడింది ఏమీ లేదన్నారు. ఆయన ప్రతిపక్ష ఎమ్మెల్యే అయినప్పటికీ అధికార పక్షానికి వంత పాడుతూ కాలం గడిపారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ఉత్తరాంధ్ర సమస్యలపై మండలిలో గళమెత్తి నిజాయితీగా పనిచేసే ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవాల్సిన అవసరముందన్నారు. మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్లోని ఉద్యోగులంతా అందుకు గట్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై శాసన మండలిలో ప్రశ్నించే, నిలదీసే గొంతు ఉండాలంటే రమాప్రభను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌తో సహ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కోసం, సిపిఎస్ రద్దు కోసం, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం, ప్రైవేట్ విద్యా సంస్థల ఉద్యోగుల, ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు జె.అయోధ్యరామ్, స్టీల్ ఎఐటియుసి నాయకులు జె.రామకృష్ణ, బిహెచ్‌ఇఎల్ యూనియన్ నాయకులు జిటిపి.ప్రకాష్ సహా ఎస్.ప్రసాద్ (షిప్ యార్డ్), పిఇసిహెచ్‌వి.సాగర్ (బిఎస్‌ఎన్‌ఎల్), పడాల రమణ (ఎఐటియుసి), లక్ష్మణరావు (విశాఖ పోర్టు), పిట్టా నారాయణమూర్తి (జింక్ ఎంప్లాయీస్ యూనియన్), బిబి.గణేష్ (ఎల్‌ఐసి), పలువురు హెచ్‌పిసిఎల్, డాక్‌యార్డ్ యూనియన్ల నాయకులు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు



రక్తదానం చేస్తున్న వారితో జగన్మోహనరావు, తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని, విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం స్ఫూర్తిదాయకమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు కొనియాడారు. యువత దీన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం పి.ఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో విద్యార్థులతో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై విద్యార్థులే వారి తల్లితండ్రులు, బంధువులకు అవగాహన కల్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. సుమారు 300 మంది రక్తదానం చేయడం ఆనందదాయకమన్నారు. రక్తదానం చేయడం వల్ల అనారోగ్యం పాలవుతారనే అపోహలు విడనాడాలని, ఆరోగ్యవంతులైన వారు ప్రతి మూడు నెలలకూ ఒకసారి రక్తదానం చేయవచ్చని స్పష్టం చేశారు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానంచేసి రక్త నిల్వలు పెంపొందించేందుకు సహకరించాలన్నారు. అనంతరం రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కొందరు విద్యార్థులు 10 నుండి 20 మంది వరకు రక్తదాతలను తీసుకువచ్చారని, ఇదే స్ఫూర్తితో మరింత మంది ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రక్తదాన శిబిరానికి రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, గాంధీ మందిర వ్యవస్థాపక సభ్యులు ఎం.వి.ఎస్.ఎస్ శాస్త్రి, నిక్కు అప్పన్న, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభలు

నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలోని కళింగ భవన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఐఎఫ్‌టియు 9వ రాష్ట్ర మహాసభలు ఆదివారంతో ముగిశాయి. 2015 నుంచి 2023 జనవరి వరకు చేపట్టిన కార్యక్రమాల నివేదికను మహాసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా పి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.పోలారి ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లు, జె.వెంకటేశ్వర్లు, ఆర్.హరికృష్ణ, రాష్ట్ర కార్యదర్శులుగా యు.వెంకటేశ్వరావు, జి.భారతి, డి.గణేష్, కోశాధికారిగా కె.వి రమణ ఎన్నికయ్యారు. వీరితోపాటు 24 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఆర్.హరికృష్ణ, యు.వెంకటేశ్వరరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా 260 మంది ప్రతినిధులు హాజరయ్యారు.



శివ్వాల తవిటినాయుడు , ఆర్ఐఒ

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- 109 కేంద్రాలు.. 51,475 మంది విద్యార్థులు
- ప్రతి చోటా సిసి కెమెరాల ఏర్పాటు
- ఆర్ఐఒ శివ్వాల తవిటినాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉన్నత చదువులకు ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకం. మార్చి 15 నుంచి నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలో ఇంటర్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జంబ్లింగ్ విధానం అమలుకు 109 కేంద్రాలను ఎంపిక చేశాం. ప్రతి చోటా సిసి కెమెరాలు అమర్చనున్నాం. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల మానిటర్ ద్వారా ప్రతి కేంద్రంలోనూ పరిస్థితులను పర్యవేక్షించేలా కెమెరాలను అనుసంధానం చేయనున్నాం. ఇందుకు సంబంధించి 'ప్రజాశక్తి' ముఖాముఖిలో ఆర్ఐఒ శివ్వాల తవిటినాయుడు మాట్లాడారు.

ఎన్ని కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు?

జిల్లాలో 109 కేంద్రాల్లో 51,475 మంది ఇంటర్మీడియట్ పరీక్షలకు సిద్ధమయ్యారు. పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనుండటంతో వాటికి తగ్గట్టు కేంద్రాలను సిద్ధం చేశాం. ఈ నెల 15న మానవ నైతిక విలువలపైన, 17న పర్యావరణ విద్యపై పరీక్షలు జరుగుతాయని, ఈ పరీక్షలు ఉదయం 10గంటల నుండి 1గంట వరకు మాత్రమే జరుగుతాయి.

మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీసుకు తావులేకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?


పరీక్షల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రతి కేంద్రంలోని అన్ని గదుల్లోనూ సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థుల ముఖ చిత్రాలు వాటిలో నిక్షిప్తం చేయడం వల్ల అభ్యర్థులపై నిఘా ఉంటుంది. సాంకేతిక నిపుణుల కమిటీ ప్రతి కేంద్రానికీ వెళ్లి కనెక్షన్ ఇవ్వడం జరుగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వందశాతం ఇవి పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలు జరుగుతున్న తీరును కమిషన్ కార్యాలయం నుంచే చూడడానికి వీలుంటుంది. చూసిరాతలు, పరీక్షకు ఆలస్యంగా వచ్చే వారి విషయంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. విద్యార్థులకు అసౌకర్యాలు, ఇబ్బందులు కలిగితే స్పందించేందుకు కూడా వీలుంటుంది.

మొదటి, రెండో ఏడాది పరక్షల్లో విద్యార్థుల సంఖ్య ఎంతమేరకు ఉంటుంది?

జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం 25,581 మంది కాగా, రెండో సంవత్సరం 25,894 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వారికి జిల్లా వ్యాప్తంగా 109 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడమైంది. ఒకేషనల్ కోర్సులతో పాటు హెచ్ఇసి, బైపిసి, ఎంపిసి, సిఇసి, ఇతర కోర్సులకు తగ్గట్టు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టరు శ్రీకేశ్ లాఠకర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

పరీక్షల నిర్వహణకు ఎలాంటి సౌకర్యాలు కల్పించనున్నారు?

జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు కేంద్రాలను సిద్ధం చేశాం. పరీక్షలు రాసేందుకు విద్యార్థులు పూర్తి సమర్థతతో ఉన్నారు. పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు విద్యార్థులకు ఆయా ప్రాంతాల వారీగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందితో పాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం చేసుకుంటున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.



ప్రశ్నాపత్రాల రక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఇంటర్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల భద్రత అత్యంత కీలకం. ప్రశ్నా పత్రాలను తీసుకెళ్లడం, తిరిగి తీసుకురావడం, వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరచడం ఎంతో కీలకం. తీసుకువెళ్లే వాహనాలు వెంట పోలీసుల రక్షణ ఉంటుంది. పరీక్ష కేంద్రాలకు దగ్గరలో జెరాక్స్ షాపులను మూసివేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మరోవైపు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ సిబ్బంది, డిఇఒ నుండి ఎంఇఒలు, హెచ్ఎంలకు ఇంటర్మీడియట్ పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఆలస్యమైతే వారిని అనుమతిస్తారా?

నిర్దేశించిన వేళల్లో జరిగే పరీక్షలకు అరగంట ముందే కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాల్సి ఉంటుంది. అనుకోని ఘటనలు ఎదురైతే వారికి పరీక్ష ప్రారంభమైన తర్వాత 15 నిమిషాల వరకే లోపలకు అనుమతిచ్చేందుకు వీలుంటుంది. అనుకోని కారణాలతో (ఉదాహరణకు బస్సు ఆలస్యం వంటి కారణాలకు మాత్రమే వెసులుబాటు కల్పించాలని బోర్డు నుంచి ఆదేశాలున్నాయి.

విధులు నిర్వహించే వారికి ఎలాంటి కోడ్ అమలులో ఉంటుంది?

పరీక్షల పర్యవేక్షణలో ఉన్న అధికారులకు గుర్తింపు కార్డుల జారీ చేస్తున్నాం. ముఖ్య పర్యవేక్షకులు, డిపార్ట్మెంట్ అధికారులే సెల్‌ఫోన్లను తీసుకెళ్ల వచ్చు. వారు కూడా ఆయా కేంద్రాల్లో ఫోన్ మాట్లాడటానికి వీల్లేదు. ఉన్నతాధికారులు ఫోన్ చేసేటప్పుడు మాత్రమే స్పందించాలి. ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్‌ను తీసుకెళ్లకూడదు. కేంద్రాల్లో ఇతరులు ప్రవేశించకుండా సబార్డినేట్ నుంచి చీఫ్ సూపరెండెంటు వరకు అందరికీ ఐడీ కార్డులు జారీ చేస్తున్నాం.

కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నారా?

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల కోసం జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. విద్యార్థులు పరీక్షాకేంద్రాలకు చేరుకునేటప్పుడు, కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా 08942 278151 నెంబరును సంప్రదించాలని కోరారు.



చిత్రపటాన్ని స్వీకరిస్తున్న ఎన్నికల కమిషనర్ శ్యామలరావు

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు సందర్శించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి, రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు శ్యామలరావు, అనకాపల్లి ఎస్పి గౌతమి శాలిని సందర్శించిన వారిలో ఉన్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో విజయేంద్ర సరస్వతి అనుగ్రహ బాషనం చేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆయనకు స్వామివారి విశేష వస్త్రాలను ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. అలాగే ఉన్నతాధికారులకు శేషవస్త్రాలను కప్పి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా 1 టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి తహాశీల్దార్ ఎన్.వెంకటరావు, జిల్లా ఉద్యానవన అధికారి ఆర్.వి.వరప్రసాదరావు పాల్గొన్నారు.

రూ.6.91లక్షల ఆదాయం

ఆలయానికి ఆదివారం రద్దీ పెరిగింది. దీంతో ఒక్క రోజులో రూ.6.91 లక్షల మేరకు ఆదాయం సమకూరింది. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,07,600, విరాళాల రూపంలో రూ.73,566లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,10,000 ఆదాయం సమకూరినట్టు ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.



మెడల్స్, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విశాఖపట్నం మధురవాడలో ఉన్న శిల్పారామంలో ఆదివారం నిర్వహించి జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభకనబరిచారు. రెండో ఎంఎస్‌కెఐ సౌత్ ఇండియన్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-2023 పోటీలో పైడిభీమవరం ఫ్యామిలీ క్వార్టర్స్‌కు చెందిన టైగర్ కరాటే అసోసియేషన్ శిక్షకుడు సింక సంతోష్ కుమార్ ఆధ్వర్యాన 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సింక భవిష్య, సింక ప్రదీప్, ఈశ్వర్‌సాయి, అంజలి, మధుప్రియ, జ్యోతి సాయిప్రసాద్, హేమంత్, జస్వంత్, సూర్య, వాసవి పాల్గొని తన ప్రతిభను కనబరిచారు. వీరికి వీరికి గ్రాండ్ మాస్టర్, సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా మెడల్స్, ధ్రువపత్రాలు అందుకున్నారు. విద్యార్థులు కష్టపడి సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు పొందుతారని ప్రశంసించారు.

కొనసాగుతున్న ఆక్రమణలు!

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్ భవనానికి ముందర స్థలాలను అధికార పార్టీ అనుయాయులు ఆక్రమించుకొని రాత్రికి రాత్రే బడ్డీలను ఏర్పాటు చేసేస్తున్నారు. ఈ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాల్సిన మున్సిపల్ అధికారులు అధికార పార్టీ నేతల మౌఖిక సిఫార్సులకు సైసై అంటూ దొరికిన వరకు దండుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత జనవరి నెలలో ముందుగా ఇదే స్థలంలో ఆ చివరన ఈ చివరన చెరో ఒక బడ్డీ చొప్పున ఏర్పాటు చేశారు. జనవరి నెలలో ఈ రెండు బడ్డీలకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హెచ్.సత్యనారాయణ ఎన్‌క్రోచ్ మెంట్ ట్యాక్స్‌ను విధించి ఆక్రమణదారులకు క్లీన్ ధ్రువపత్రం జారీ చేశారు. మళ్లీ శనివారం అర్ధరాత్రి 12 గంటల తరువాత నియోజకవర్గ



నూతనంగా ఏర్పాటు చేసిన బడ్డీలు

వైసిపి నాయకులు ఇంట్లో పనిచేస్తున్న కృష్ణాపురానికి చెందిన ఒక ప్రయివేటు కారు డ్రైవర్, 15వ వార్డుకు చెందిన ఓ వ్యక్తి మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తూ ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి, మున్సిపాలిటీలోని ఓ మాజీ కౌన్సిలర్ వైసిపి కీలక నేత డ్రైవర్ మొత్తం ముగ్గురూ కలిసి మూడు బడ్డీలను కూరగాయల మార్కెట్ ముందు బాగాన మిగిలిన స్థలాల్లో ఏర్పాటు చేసినట్లు స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. జనవరి నెలలో ఏర్పాటు చేసిన బడ్డీలను రూ.ఆరు వేలకు అద్దెకు వేరే వారికి ఇచ్చినట్లు స్థానిక వర్తకులు చెబుతున్నారు. శనివారం రాత్రి పెట్టిన బడ్డీల యజమానులూ అద్దెకు ఇచ్చే ప్రాతిపదికనే వీటిని ఏర్పాటు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తమకు ఆ స్థలం ఇస్తే చిరు వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటామని పేదలు కోరుతున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడును వివరణ కోరగా, కూరగాయల మార్కెట్ వద్ద ప్రభుత్వ స్థలంలో బడ్డీలు ఏర్పాటు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. మున్సిపాలిటీ అధికారులు వారికి ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం పరిశీలించి వాటిని వెంటనే తొలగిస్తామని తెలిపారు.

మెనూ ఛార్జీలు పెంచాలి

మెళియాపుట్టి: మార్చి 2వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో రాగిజావ అమలు చేయాలని తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచి, రాగి జావకు కావాల్సిన అన్ని వసతులూ కల్పించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం జిల్లా కోశాధికారి కె.సుశీల డిమాండ్ చేశారు. ఆదివారం ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ఆధ్వర్యాన మండల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 20 ఏళ్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను కార్మికులుగా గుర్తించే పరిస్థితి లేదన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారికి కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా వంటి సదుపాయాలు ఏమీ లేవన్నారు. నూతన విద్యా విధానం పేరుతో 3,4 5 తరగతులు హైస్కూల్స్‌లో విలీనం చేయడం ద్వారా వంట కార్మికులు ఉపాధి కోల్పోయి, రోడ్డున పడ్డారని అన్నారు. వీరికి తక్షణమే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో మృతి చెందిన వంట కార్మికురాలి కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆమె కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, యూనిఫాం వెంటనే ఇవ్వాలని, వంట పాత్రలు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమా గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 60ఏళ్లు నిండిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించి, ఉద్యోగ విరమణ సదుపాయం కల్పించాలి అని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎ.కళావతి, సీతమ్మ, కుమారి, సరోజినీ, పపామ్మ, రేసమ, జయలక్ష్మి, సుధరమ్మ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న వంట కార్మికులు

ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ'

లావేరు: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు వ్యతిరేకంగా ఏప్రిల్ 5 చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ పిలుపునిచ్చారు. లావేరులో ఆదివారం మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం మండల అధ్యక్షులు బి.ఉత్తర అధ్యక్షతన మండల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రలోని బిజెపి ప్రభుత్వం పచ్చి మతోన్మాద కార్పొరేట్ అనుకూల విధానాల్ని అవలంబిస్తుందని అన్నారు. కార్మికులను బానిసలుగా మార్చాలని చేస్తుందన్నారు. స్కీం వర్కర్లకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పదవీ



మాట్లాడుతున్న రమణ

విరమణ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. వంట కార్మికులకు పని ప్రదేశాల్లో మంట షాపులు నిర్మించాలన్నారు. వంట పాత్రలు ఇవ్వాలని, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మెలియాపుట్టిలో వంట చేస్తుండగా గాయపడి మృతి చెందిన వంట కార్మికులు రమ కుటుంబానికి రూ.20 లక్షలు చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.రామానుజమ్మ, యు.సుజాత, పి.పుణ్యవతి, జి.సరోజిని, ఎం.సంతోషి, ఎల్.లక్ష్మి, జి.మల్లేశ్వరి, ఎస్.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపిపి దాసు

ప్రజాశక్తి- సోంపేట

ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను సభ్యులు నిలదీశారు. ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఎటువంటి కేటాయింపులు, నిధుల ప్రస్తావన లేకుండా సాదాసీదాగా సాగింది. సోంపేట వైస్ ఎంపిపి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో ధాన్యం లక్ష్యాలు పూర్తయ్యాయని చెప్పడంతో ఈ ప్రాంత రైతులు సారవకోట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో ధాన్యం విక్రయించాల్సి వచ్చిందన్నారు. ఒక్కో బస్తాకు రూ.150 రైతు నష్టపోయాడని, డిఎస్‌డిటి పైడి కూర్మారావు సజావుగా పని చేయడం లేదని అన్నారు. మండలంలో సుమారు 4వేల బస్తాల ధాన్యం కొనకుండా ఉన్నాయని, తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని ఎఒ నరసింహమూర్తిని నిలదీశారు. బేసి రామచంద్రాపురం సర్పంచ్ ప్రతినిధి శ్రీకృష్ణ, సుంకుడి సర్పంచ్ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు నష్టం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఉద్యానవనశాఖ అధికారి మాధవిలత, మంగి గణపతి, రాజారావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





గుర్తు తెలియని మృతదేహం

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని నాగావళి నదీ తీరంలో ఆదివారం గుర్తుతెలియని యువకుని మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుడు వయసు 40 ఏళ్ల పైబడిన ఉంటుందని, నీలం చారల షర్టు, లుంగీ దరించి ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతుని వివారాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



విజయలక్ష్మి (ఫైల్)

మెళియాపుట్టి: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మురికింటిభద్రకు చెందిన లండ చిన్న వెంకటరావు వలస కూలీ. భార్య లండ విజయలక్ష్మి (40)తో కలిసి కొన్నేళ్లుగా గుంటూరులో ఉంటున్నాడు. ఆదివారం అక్కడ సంభవించిన విద్యుదాఘాతంతో విజయలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆమె మృతితో మురికంటిభద్రలో విషాదఛాయలు అలముకున్నాయి.



పరామర్శిస్తున్న అచ్చెన్నాయుడు

అచ్చెన్న పరామర్శ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన టిడిపి నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు ఆదివారం పరామర్శించారు. వెంకటేష్ ఇంటికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. వీరి వెంట నగర టిడిపి ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, జామి భీమశంకర్ తదితరులు ఉన్నారు.



పుష్పగుచ్ఛాన్ని అందస్తున్న వైద్యులు

లైఫ్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో సరైన వైద్య సేవలు అందించడానికి అన్ని మౌలిక సదుపాయాలతో సామాన్యుల సైతం అందుబాటులో ఉండే విధంగా ఆస్పత్రి పనిచేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని డైమండ్‌నైట్ సమీపాన నూతనంగా నిర్మించిన లైఫ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ప్రారంభించారు. విభాగాల వారీగా యూనిట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సనపల చంద్రశేఖర్, ఎస్.శిరీష, ఎస్.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్‌ను కలిసిన నేతాజీ, దేవరాజ్ సాహు

'నర్తు'కి అండగా నిలవాలి

కవిటి: స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావుకి అండగా నిలవాలని కవిటి వైస్ ఎంపిపి పూడి నేతాజీ, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. ఆదివారం స్పీకర్‌ను తన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆదేశాల మేరకు నర్తు రామారావుకు మద్దతుగా జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు వీరు తెలిపారు.



మాట్లాడుతున్న మోహనరావు

అమృత ఆహారంపై సదస్సు

కొత్తూరు : పచ్చి కూరగాయలతోనే ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ రామ్మోహనరావు అన్నారు. స్థానిక రామాలయంలో పాతపట్నం నియోజకవర్గ వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అధ్యక్షతన ఆదివారం సర్వ రోగ నివారణకు అమృత ఆహారంపై సదస్సు నిర్వహించారు. పచ్చి ఆహారం, వండిన కూరలు, పచ్చి పాలు, పచ్చి గుడ్లు తినవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మీసాల ఉషారాణి, ఎంపిపి తూలుగు మేనక, డాక్టర్ శశిభూషణరావు, వైసిపి నాయకులు రంజిత్‌కుమార్, లోతుగెడ్డ తాతాబాబు, కోయిలాపు సంజీవరావు, ఆర్.కన్నయ్య, ఎ.నాగేశ్వరావు, పి.వెంకటకృష్ణ, ధర్మారావు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

పర్లాకిమిడి : గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణం వద్ద వినియోగదారుల హక్కుల పరరక్షణ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం అవగాహన కల్పించారు. ముందుగా పాతబస్టాండ్ నుంచి కాలేజీ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఆహారం సంరక్షణపై అవగాహన కల్పించారు. జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథం, కార్యాచరణ జిల్లా అధ్యక్షులు తనూజా శతపతి, జిల్లా సహాయ కార్యదర్శి లింగరాజ్ పానిగ్రాహి, కాశీనగర్ బ్లాక్ అండ్ ఎన్ఎసి అధ్యక్షులు కరణం వెంకటరావు, గుసానీ బ్లాక్ కార్యదర్శి కె.బాలకృష్ణ, భగవత్ పాడి పాల్గొన్నారు.

చింతలగార భూ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని చింతలగార భూ సమస్య పరిష్కారమైందని సిపిఐ నాయకులు అనపాన షణ్ముఖరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూ సమస్యను పరిష్కరిస్తూ టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను చూపించారు. సర్వే నెంబర్ 8/2 లోని 9.4 ఎకరాలను 1978సంవత్సరంలో కొనుగోలు చేసి అనుభవిస్తున్న రైతులను కాదని బినామీల పేరుతో రికార్డులను మార్చి రిజిస్ట్రేషన్ చేయించారని, ఈ భూమిని కొందరు కబ్జా చేశారని దీనిపై సుదీర్ఘ పోరాటం చేశామన్నారు. పోరాటం ద్వారానే సమస్య



ఉత్తర్వులను చూపుతున్న షణ్ముఖరావు

పరిష్కారమమైందన్నారు. కబ్జా చేసిన వారి పేర్లు తొలగించి రైతులకు న్యాయం జరిగేలా అధికారులు చొరవ చూపినందుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఆనపాన షణ్ముఖరావు, రైతులు తిర్లంగి సత్యం, రాజేష్, హనుమంతు మనోహర్, సిగిలిపల్లి భాస్కరరావు, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కి ఐదుగురు ఎంపిక



సైనిక్ స్కూల్‌కు అర్హత సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కాపుతెంబూరు పంచాయతీ లట్టిగాం గ్రామంలోని శ్రీ సాయి ఉషోదయ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించారు. కాపుతెంబూరుకు చెందిన కాంటూరి నిరంజన్, పోలాకి ప్రభాస్, వడ్డే జస్వంత్, నగిరి ఈశ్వరవర్ధన్, సుబ్బమ్మపేట గ్రామానికి చెందిన పల్ల ధాత్రి ఆల్ ఇండియా సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించారని ప్రిన్సిపాల్ సింగుపురం కూర్మరావు తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. స్కూల్ కరస్పాండెంట్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సైనిక స్కూల్‌కు అర్హత సాధించినందుకు ఆనందంగా ఉందన్నారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ కూర్మారావు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

భవిష్యత్‌కు భరోసా 'మాతృమూర్తి'



మాట్లాడుతున్న అంగ సురేష్

ప్రజాశక్తి- కవిటి

భవిష్యత్‌కు భరోసాగా మాతృమూర్తి యువజన సంఘం నిలుస్తుందని ఆ సంఘం కార్యదర్శి అంగ సురేష్ ఆకాంక్షించారు. ఆదివారం కుసుంపురంలో ఆ యువజన సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన తమ సంస్థ మరింత మందికి సాయం అందించాలని, దానికి సంస్థ సభ్యులతో పాటు దాతల సహాయ సహకారాలు అవసరమని అన్నారు. తమ సంస్థ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న బడుగు బలహీనులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరారు. పేదల కడుపునింపుతున్న అన్నపూర్ణ అమృతహస్తం పథకం మరింత మందికి అందించాలని సూచించారు. సమావేశంలో మాతృమూర్తి యువజన సంఘం కార్యవర్గం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రయ్యకు అభినందనలు

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని మదుపాం విలేజ్ లైన్‌మేన్ ఇమందు ఎర్రయ్య మంచి తనంతోనే మర్యాద, గౌరవాన్ని దక్కించుకున్నారని సర్పంచ్ అప్పలనాయుడు అన్నారు. తన విద్యుత్ విధుల్లో ఉన్న సమయంలో తనకి రోడ్డుపై పర్సు దొరికింది. అందులో వెలగాడకు చెందిన చంద్రశేఖర్‌గా గుర్తించారు. వెంటనే సర్పంచ్‌కు నిజాయితీ ఎర్రయ్య ఆ పర్సును అందజేశారు. సర్పంచ్ చంద్రశేఖర్‌కు ఫోన్‌లో సమాచారం అందజేశారు. అనంతరం సర్పంచ్ ఇంట్లో అందరి సమక్షంలో పర్సును చంద్రవేఖర్‌కు ఆదివారం అందించారు. పర్సులో విలువైన కార్డులు, రూ.30 వేలు ఉన్నాయి. దీంతో అందరూ కలిసి ఎర్రయ్యను అభినందించారు.



అభినందిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

పోలియో నిర్మూలనే రోటరీ లక్ష్యం

సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

శ్రీకాకుళం అర్బన్ : పోలియో నిర్మూలనే రోటరీ క్లబ్ లక్ష్యమని ఆ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ వై.కళ్యాణ చక్రవర్తి అన్నారు. నగరంలోని హెచ్‌బి కాలనీలో ఉన్న రోటరీ వనంలో పోలియో నిధుల సేకరణపై రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, ఆముదాలవలస సంయుక్తంగా ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోటరీ అంతర్జాతీయ సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్, బిల్‌గేట్స్ ఫౌండేషన్, ఇతర ప్రభుత్వ సంస్థలతో కలిసి పనిచేస్తూ ఇప్పటివరకు పోలియో నిర్మూలనకు రూ.30 వేల కోట్ల నిధులు ఖర్చు చేసిందన్నారు. ఈ ఏడాది రోటరీ జిల్లా 3020 పోలియో నిర్మూలనకు రూ.రెండు కోట్లు నిధులు సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.50 లక్షలు నిధులు సేకరించామని తెలిపారు. దేశంలో పోలియో నిర్మూలన అయిందని, కానీ పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల్లో పోలియో వ్యాధి ఉండటంతో పొంచి ఉన్న ప్రమాదంగా భావించి వంద శాతం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు రోటరీ సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో



మాట్లాడుతున్న కళ్యాణ చక్రవర్తి

సహాయ గవర్నర్లు ఎం.ఆర్.కె.దాస్, జలుమూరు వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం అధ్యక్ష, కార్యదర్శులు అన్నెపు సత్యనారాయణ, బరాటం శ్రీనివాస్, సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు కింతలి నాగేశ్వరరావు, కెప్టెన్ జగదీష్, ఆమదాలవలస అధ్యక్ష, కార్యదర్శులు పి.పాపారావు, తేజలక్ష్మి, రోటరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు వరదా కొండబాబు, క్లబ్ పోలియో చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, దేవరశెట్టి శివశంకర్, డాక్టర్ మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.



పాల్గొన్న గ్రామస్తులు

లక్ష్ముడుపేటలో అన్నదానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని 23వ వార్డు లక్ష్మడుపేటలో భక్తాంజనేయ స్వామి వార్షికోత్సవ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యాన ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామస్తులు రెండు వేల మంది వరకూ పాల్గొన్నారు. కార్యక్రమంలో లయ కమిటీ సభ్యులు దుంపల చిరంజీవి, కూన ఆంజనేయులు, గురుగుబెల్లి నాగేశ్వరరావు, అన్నెపు ఎర్రన్నాయుడు, మామిడి శ్రీను, వి.శ్రీను, పైడి లోకేష్, కూన శ్రీను పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

బూర్జ : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు చేస్తే వారి తల్లిదండ్రులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ పిఒ గీతారాణి హెచ్చరించారు. ప్రస్తుతం అధికంగా పెళ్లిళ్లు జరుగుతున్న సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బాల్యవివాహాలకు సిద్ధమైనట్లయితే ఐసిడిఎస్ కార్యకర్తలు తమకు సమాచారం అందజేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

చెరుకు సాగు తగ్గుముఖం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వాణిజ్య పంటైన చెరుకు సాగు క్రమేపి తగ్గుముఖం పట్టింది. సాగుకు పెట్టుబడి ఎక్కువ కావడం, గిట్టుబాటుధర లేకపోవడంతో రైతులురీ పంట సాగుపై మక్కువ చూపడం లేదు. మండలంలోని గొప్పిలి, గోకర్ణపురం, కోసమాల, వసుంధర, పెద్ద పద్మాపురం, గోపినాథపురం, పెద్ద జగన్నాథపురం, శేకరాపురం, చాపర, మాకనపల్లి, దుర్భలాపురం, తదితర ప్రాంతాల్లో 300 ఎకరాల్లో చెరుకు సాగు అయ్యేది. వాతావరణ పరిస్థితులు అనుకూలం లేకపోవడం తెగుళ్ల వెంటాడటంతో రైతులు నష్టపోతున్నారు.



గొడ్డలో సాగు చేస్తున్న చెరుకు

దీంతో నాలుగేళ్లుగా సాగు గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం గొడ్డ మాకనపల్లి, దుర్భలాపురం, గొప్పిలి ప్రాంతాల్లో కేవలం 20 ఎకరాల్లో మాత్రమే చెరుకు సాగును రైతులు చేపట్టారు.

చిన్నారికి అండగా 'ఎస్‌జిఎఫ్ '



సంతోష్‌కి నగదు అందజేస్తున్న ఎస్‌జిఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మండలంలోని గొనపపుట్టుగ గ్రామానికి చెందిన మూడు నెలల చిన్నారికి ఎస్‌జిఎఫ్ సంస్థ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన లండ సంతోష్ తన కుమార్తెకు గుండె ఆపరేషన్ చేయాలని, దీని కోసం రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న సంతోష్‌కు ఎస్‌జిఎఫ్ సంస్థ ఆదివారం రూ.42వేలు అందజేసింది. ఈ సందర్భంగా ఎస్‌జిఎఫ్ సభ్యులు మాట్లాడుతూ దయనీయ స్థితిలో ఉన్న చిన్నారిని ఉదారంగా ఆదుకోవాలని కోరారు.

వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని పురుషోత్తపురంలో మాజీ సర్పంచ్, క్రీ.శే. కిల్లి వెంకట నరసింహారావు-శశికళమ్మ జ్ఞాపకార్థం ఆదివారం ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు వైద్యులు తమ్మినేని మోహనరావు, బగాన కార్తికేశ్వరరావులు పాల్గొని 200 మంది రోగులకు వైద్య పరీక్షించారు. ఈ సందర్భంగా వైద్యులు మోహనరావు మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకొని కేన్సర్ బారిన పడే ప్రమాదం నుంచి బయట పడవచ్చు అవగాహన కల్పించారు. దంత వైద్యులు బగాన కార్తికేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యులను సంప్రదించి దంత సమస్యలు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొన్నాడ శ్రీరామచంద్రమూర్తి, శ్రీమన్నారాయణమూర్తి, కిల్లి హరికృష్ణ, తాంద్ర రాజేంద్ర, పేడాడ దాలినాయుడు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

శ్రీకాకుళం : శ్రీకాకుళం రూరల్ మండలం జి.జి.పేటలో సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్యూటీ డాక్టర్ శ్రీనివాసరావు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సుగర్, బిపి తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

మొక్కజొన్న సాగుతో రైతులకు లాభాలు



అక్కివలసలో రైతుకు సూచనలు ఎఒ మోహనరావు

వ్యవసాయ అధికారి మోహనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మొక్కజొన్నతో రైతులకు లాభాలు మిన్న అని వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు అన్నారు. మండలంలో కొరపాం, మర్రి కొత్తవలస, నిమ్మ తొర్లాడ, వెదుళ్లవలస, మండాది, మునగవలస, సైలాడ, అక్కివలస, వంజంగి, వంజంగిపేట, దూసి తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 140.77 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నట్లు తెలిపారు. పెసర, మినుముల పంట ద్వారా వచ్చే కంటే మొక్కజొన్న పంట వల్ల ఆదాయం వస్తుందన్నారు. అధిక నీటి సదుపాయం కలిగి ఉన్న ప్రాంతాల రైతులు ఈ పంటను వేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పూతకు ముందు, పూత దశలో, గింజ పాలు పోసుకునే దశలో బాగా నీరు పెట్టడం అవసరమని అన్నారు. 30-40 రోజులలోపు ఉన్న లేత పైరుకు అధిక నీరు హానికరమని వివరించారు. విత్తిన తర్వాత చేలో నీరు నిలిస్తే విత్తనం మొలకెత్తదని పేర్కొన్నారు.

సాధారణంగా పంట కాలంలో 6-8 నీటి తడులు అవసరమని తెలిపారు. సంకర రకాలకు ఎకరాకు 8 కిలోల విత్తనాన్ని సాళ్ల మధ్య 60 సెంటీమీటర్లలో మొక్కల మధ్య 20 సెంటీమీటర్లు ఉండేటట్లు విత్తుకోవాలన్నారు. ఎకరానికి 217 కిలోల యూరియా, 200 కేజీల పాస్పేట్, 58 కిలోల పొటాష్ అవసరం అవుతుందని చెప్పారు. 60-65 రోజుల తరువా చివరి దశలో నత్రజని ఎరువును పైరుకు అందించాలని తెలిపారు.



మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సైనికులుగా వివిధ హోదాల్లో రక్షణ రంగంలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన మాజీ సైనికులకు ఉపాధి అవకాశాలు ప్రయివేటు యాజమాన్యాల్లో అనేకం ఉన్నాయని, వాటిని తెలుసుకుని నచ్చిన చోట పనిచేసే విధంగా ఆలోచన చేసుకోవాలని మాజీ సైనికుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు సూచించారు. నగరంలోని రెల్లి వీధిలో సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి అవకాశాలపై నిష్ణాతులుగా ఉన్న ఈశ్వరచంద్, అగ్గల హనుమంతరావులు పలు సూచనలు చేశారు. రియల్ ఎస్టేట్ రంగంలోను, సెక్యూరిటీ రంగంలో మాజీ సైనికులకు అనేక రకాలైన ఉపాధిఅవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఒఆర్‌పి-2లో మాజీ సైనికులకు జరిగిన అన్యాయంపై చర్చించారు. అందుకు నిరసనగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే రథసప్తమి వేడుకల్లో సేవలందించిన మాజీ సైనికులకు సన్మానించారు. సమావేశంలో మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, హానరరీ చైర్మన్ ఎస్.ఎస్.ఎల్.మూర్తి, హానరరీ ప్రెసిడెంట్లు బి.సంజీవరావు, టి.కృష్ణారావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీ పి.మురళీధరరావు, ట్రెజరర్ ఐ.ఢిల్లేశ్వరరావు, మహిళా సెక్రటరీ పి.పద్మావతి, ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎ.వి.జగన్మోహనరావు పాల్గొన్నారు.



కథను చదువుతున్న విద్యార్థి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

లావేరు : మురపాక శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కథలు చదివి వినిపించారు. వడ్డీ స్వాతికి ప్రథమ బహుమతి, శ్యామలకు ద్వితీయ బహుమతి, దేవికి తృతీయ బహుమతులు వచ్చాయి. గ్రంథాలయం తరపున విజేతలకు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖ రావు, పాఠకులు, ధరావత్తుదారులు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నడక ఉద్యమం బలోపేతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నడక ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వాకర్స్‌క్లబ్ సభ్యులు కృషి చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ క్రోతు సత్యం పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం స్టార్ వాకర్స్ క్లబ్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ, జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారని అన్నారు. లయన్స్ క్లబ్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు హరికాప్రసాద్ మాట్లాడుతూ నడకతో పాటు చక్కని నడవడికను నేర్చుకోవడానికి వాకర్స్ సంస్థలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాబినెట్ కోశాధికారి కె.వి.రమణమూర్తి, చీఫ్ కో-ఆర్డినేటర్ పి.జి.గుప్తా, ఎస్.సంజీవరావు, వి.నాగభూషణం, గజల్స్ వాసుదేవ్, అంజనీపుత్ర వాకర్స్ క్లబ్ అధ్యక్షులు బాలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

స్టార్ వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న స్టార్ వాకర్స్ నూతన కార్యవర్గం

అధ్యక్షులుగా శాసపు జోగినాయుడు, గౌరవ అధ్యక్షులుగా జి.ఇందిరాప్రసాద్, సెక్రటరీగా జి.సంతోష్, కోశాధికారిగా బి.దేవీప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎస్.వేణుగోపాలరావు, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జి.నారాయణరావు, జోలీ వాకర్, ఎం.మల్లిబాబు, డైరెక్టర్లుగా జి.సత్యనారాయణ, కె.వి.రమణమూర్తి, పి.జి.గుప్త, కామేశ్వరరావు, ఆర్.వి.వి.ప్రసాద్, ఎస్.సంజీవరావు, బి.వి.రవిశంకర్, జి.ఆనందరావు, జి.వాసు, ఎం.ధనుంజయ భట్లు, సిహెచ్.సూర్యారావు, ఎస్.అప్పలనాయుడు, ఎ.వి.రమణ, బొడ్డేపల్లి ప్రసాదరావు, హరికాప్రసాద్, జి.వాసుదేవరావు, గజల్స్ వాసుదేవ్‌లను ఎన్నుకున్నారు.

దాతల ఉదారత

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని దిమ్మిడిజోల గ్రామంలో దాతలు తమ ఉదారతను చాటుకున్నారు వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటి కోనేరు, బస్సు షెల్టర్ వద్ద ప్రజలు, ప్రయాణికులు కూర్చొనేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. ఇదే గ్రామానికి చెందిన కొల్లి వీరన్న, కుమ్మరి షణ్ముఖరావు, సలాం ఈశ్వరరావు, రేగల లక్ష్మీకాంతం, వాణిల లోకనాథం గ్రామంలోని పలు చోట్ల బెంచీలను ఏర్పాటు చేశారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.



పలు కూడళ్ల వద్ద దాతలు ఏర్పాటు చేసిన బెంచీలు



మాట్లాడుతున్న రామారావు

ఆర్ట్స్ కళాశాల జనరల్ హాస్టల్‌ను పునరుద్ధరిస్తాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్రలోనే ప్రభుత్వ కళాశాలల్లో అత్యంత ప్రాధాన్యత గల ఆర్ట్స్ కళాశాలలో ఉన్న జనరల్ హాస్టల్‌కు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో 1964 నాటి ఆర్ట్స్ కళాశాల హాస్టల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం ఆదివారం నిర్వహించారు. 1964లో కళాశాల వసతిగృహంలో ఉంటూ చదువుకొని అనేక రంగాల్లో స్థిరపడిన సుమారు 130 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ ఆత్మీయ కలయికలో తమ యొక్క అనుభవాలను పంచుకున్నారు. కళాశాల, జనరల్ హాస్టల్ సమాజంలో మంచి గుర్తింపు ఇచ్చాయని అన్నారు.

అటువంటి హాస్టల్ భవనం జీర్ణావస్థకు చేరిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్‌గా 25 ఏళ్ల పాటు సేవలందించిన జి.ఎస్.రామారావు, అప్పటి అధ్యాపకులు కె.భగవతిరావు, సన్యాసిరావు, కె.వి.అప్పలనాయుడులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. జనరల్ హాస్టల్ మొట్టమొదటి విద్యార్థి (1964-67) పూడి బాలయ్య మాస్టారూ సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం వైస్ ప్రెసిడెంట్ సురంగి మోహనరావు, పాలవలస కరుణాకర్, డాక్టర్ సలాన తేజేశ్వరరావు, వై.రాంబాబు, ఆర్.సూర్యనారాయణ, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ డి.పైడితల్లి పాల్గొన్నారు.